# రామేశం పెళ్లి



- కలువకొలను రాంమోహన్‌రాజు

"అన్నట్టు ఈ వెధవ గదిలో ఉన్నట్టా? లేనట్టా?" మూసిన గది తలుపులు తోస్తూ రాఘవులు గదిలోకి అడుగుపెట్టాడు.

"ఏమిటిస్వామీ నన్నేనా తలుచుకుంటున్నావు?" అన్నాడు గదిలో కింద పరిచిన పరుపు మీద పడుకున్న రామేశం.

"ఆ.... నిన్నే కానీ ఎన్నడో మూడు రోజులకింద నీకు చెప్పిన మాట గుర్తుందా? అసలు మనిషివే అజ లేకుండా పోతివి ఏమన్నమాట?" రాఘవులు చెప్పులు గదిలో ఓ మూలకి విడుస్తూ అన్నాడు.

"చెప్పడానికేం? నువ్వలా చెబుతూనే వుంటావు" రామేశం పడుకున్న వాడల్లా లేచి కూచుంటూ అన్నాడు.

"ఇంతకీ నీ కా పిల్లను చూడాలని వుందా లేదా?" అంటూ రాఘవులు అతని పక్కనే చతికలపడ్డాడు. ఇద్దరూ స్నేహితులు. ఒక్క వూరి వాళ్లు. ఒకే కాలేజీలో ఉద్యోగం చేస్తున్నారు. రాఘవులకి పెళ్లయింది. భార్యతో వేరే కాపురం ఉంటున్నాడు. రామేశాని క్కూడా త్వరగా పెళ్లి చెయ్యాలని అతని తండ్రి తాపత్రయం. రాఘవుల్ని ఆ పనిమీద నియోగించా డాయన. ఏ పిల్ల రామేశంకి నచ్చటం లేదు. అలా అని కట్న కానుకల మీద అతనికి పట్టింపు లేమీ లేవు. తండ్రిగానీ పట్టు పట్టకపోతే అసలు కట్నమే వద్దనగల మనిషి. రామేశం పెళ్ళెప్పుడ వుతుందా తనకీ బాధ ఎన్నడు తప్పిపో తుందా అని రాఘవులు బాధ. ప్రస్తుత సందర్భం అదే.

"ఇంతకీ ఏమిట్రా నీవుద్దేశం? ఆదివారం నాడు ఆ పిల్లని చూడ్డానికి పోదామా వద్దా?"

"వెళదాం లేవోయ్! ఇంతకీ ఇది ఎన్నో సంబంధం?" అన్నాడు రామేశం కాళ్లు చాపుకుంటూ.


"ఏమో ఎవడికి గుర్తుంది? దీనికి గూడా ఎకౌంట్సు మెయింటైన్ చెయ్యాలా ఏమిటి?" అన్నాడు రాఘవులు.

"ఎకౌంట్సు ఏం ఖర్మ? మినిట్సు గూడా మెయింటైన్ చెయ్యాలి మరి!" రామేశం బెదిరించాడు.

"రాస్తానులేరా! మంత్ర సాని తనానికి ఒప్పుకున్నాగా మరి!" రాఘవులు గుర్రుమన్నాడు.

ఆదివారం నాడు పొద్దున్నే పదిగంటకల్లా రామేశం, రాఘవులిద్దరూ తయారై పిల్లను చూట్టానికి బయల్దేరారు. వీళ్ల వెళ్ళేసరికి పిల్ల తండ్రి సుబ్రమణ్యాం యావత్తు కుటుంబ సభ్యులతో టీవీలో సీరియల్స్ ఎంజాయ్ చేస్తున్నాడు. వీళ్లని చూడగానే ఆయన లేచి ఎదురుగా వస్తూ

"రండి రండి. మీ కోసమే ఎదురు చూస్తున్నాం" అని ఆహ్వానించాడు. వీళ్లిద్దరూ గదిలోకి అడుగు పెట్టేసరికి గదిలో ఉన్న వాళ్లంతా మంత్రం వేసినట్టు మాయమయ్యారు. గదిలో అలంకరణ ఆర్భాటంగానే ఉంది. ఓ మూల టేబిలు మీద ఏవో కొన్ని లావుపాటి గ్రంథాలు పేర్చి ఉన్నాయి. ఓ గోడకి సోఫా, దానికెదురుగా గోడకి నాలుగు కుర్చీలు, వాటి మధ్య టీపాయ్ అమర్చి ఉన్నాయి. మరో గోడకి స్టాండు మీద కలర్ టీ.వి, కింది అరలో వి.సి.డి ఉన్నాయి. టీపాయ్ మీద



## మరో ప్రేమలేఖ ఎప్పుడు?

"నవ్వడం ఓ భోగం.
నవ్వించగలగడం ఓ యోగం.
నవ్వురాకపోవడం నవ్వలేకపోవడం ఓ రోగం!"

'నవ్వు రాకపోవడం నవ్వలేకపోవడం ఒక రోగం!' అంటాడు జంధ్యాల. నిజమే! ఈరోజు శాస్త్రీయదృష్ట్యా చూసినా 'నవ్వు' ఆరోగ్యానికి అత్యవసరమైంది. అనుసరణీయమైంది అనిపిస్తుంది.. అయితే 'నవ్వు' ఎలా వస్తుంది? చక్కిలిగింతలు పెడితే వస్తుందా? నవ్వమని కాళ్ళుచేతులూ పట్టుకు బ్రతిమాలితే వస్తుందో, ఏంచేస్తే వస్తుంది? అదే చాలామందికి తెలియక తంటాలుపడుతున్నారు. రచయితలు, దర్శక నిర్మాతలు కూడా నిజంగా 'జంధ్యాల' తెలుగు పరిశ్రమకి దక్కిన అపురూపమయిన సంపద. ఈ సంపదని సవ్యంగా వాడుకోలేదేమో అనిపిస్తుంది మన తెలుగు పరిశ్రమ. ఏది ఏమైనా మళ్ళీ 'శ్రీవారికి ప్రేమలేఖ' లాంటి చిత్రాలు రావాలి! జంధ్యాల కోటిమిలియన్నవ్వుల చిత్రాల్ని అందించాలి! **- సాయిరాం**

రెండు జర్నల్సూ, నాలుగు పత్రికలు ఉన్నాయి. వాటిలో ఒకటి ఇంగ్లీష్‌ది. గోడకి ఉన్న అద్దాల షోకేసుల్లో ఏవో ఇత్తడి కళా ఖండాలు, కొయ్య బొమ్మలు పేర్చి ఉన్నాయి. ఓ మూలకి చిన్న టేబిలు మీద ఫోనూ దాని వెనగ్గా చిన జీయరు స్వామి వారి ఫోటో ఉన్నాయి. ఫ్లోరింగు మీద చవకబారు రెగ్జిన్ కార్పెట్ పరిచి ఉంది.

"అలా సోఫాలో కూచోండి." సుబ్రమణ్యం మర్యాద చేశాడు. తాను ఎదురుగా కూచున్నాడు. ఆయన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసి రిటైరయ్యాడు. ట్యూషన్లూ అవీ చెప్పి గైడుల్లాంటివి రాసి బాగా సంపాదించాడని ప్రతీతి. నగరంలో అతనికున్న నాలుగిళ్లూ అందుకు నిదర్శనంగా చెబుతుంటారు. ధన దర్పం ఆయన మొహంలో తాండవిస్తూ ఉంటుంది. సాధారణంగా లెక్చరర్ ఉద్యోగాలు చేసే వాళ్ల మొహాలు అంత దర్పంగా ఉండవు.

రామేశం అతన్ని పరిశీలనగా చూస్తూండగానే ప్లేట్లలో ఉప్మా పెట్టుకుని సుబ్రమణ్యం భార్య విశాలాక్షి వచ్చింది. సుబ్రమణ్యం లేచి వాటినందుకుని రామేశానికీ, రాఘవులకీ చెరో టీ అందించి తానోటి తీసుకుని కూచున్నాడు. విశాలాక్షి కూడా ఆయన పక్కనే కూచుంది. ఆమె మెడలో అవసరానికి మించి నగలున్నట్టు గమనించాడు రామేశం. ఇంట్లో ఉన్నప్పుడు అన్ని నగలు ఎవరూ వేసుకోరు సాధారణంగా ఏ పేరంటానికో వెళ్లినప్పుడు తప్పితే.

స్పూన్‌తో ఉప్మా తింటుండగా 'టీవి పెట్టేరా?' అంటూ జవాబు కోసం ఎదురు చూడకుండానే సుబ్రమణ్యం రిమోట్‌తో టీవి ఆన్ చేశాడు. అసలదెప్పుడు ఆఫయిందో రామేశం గమనించనేలేదు. సీరియల్ మళ్లీ మొదలైంది. ఉప్మాలో జీడిపప్పు, వేరు శనగ గింజలు వెయ్యవలసిన దానికన్నా ఎక్కువేశారు. డాల్డా మోతాదు మించి జవ జవ లాడుతోంది. 'ఈ ఉప్మా చేసిన వాళ్లకు దేన్నైనా ఉడకబెట్టడం తప్ప ఇంకేం తెలీదు' అనుకున్నాడు రామేశం.

'టీవిలో కలర్ కాంబినేషన్ ఎవర్రా పాడుచేసిందీ!" సుబ్రమణ్యం రిమోట్‌తో టీవి మీద ఏవో తమాషాలు ప్రారంభించాడు. "ఇది ఈ మధ్యే సింగపూర్‌నించి తెప్పించాం. ఉన్నదాన్ని ఉన్నట్టుండనీయరుగదా!" అని అక్కడ లేని వాళ్లెవరి మీదో విసుక్కున్నాడు. రామేశానికి ఇదంతా చికాగ్గా తోచింది. "ఏమిటి సంగతి" అన్నట్టు రాఘవులికేసి చూశాడు. రాఘవులు ఉప్మా ప్లేటు కింద పెట్టి గొంతు సవరించుకున్నాడు. అది గమనించినట్టు సుబ్రమణ్యం భార్యకేసి చూశాడు. ఆమె లేచి "కాఫీ తీసుకొస్తాను" అని సీన్‌లోకి ఎంటరయింది. ఈసారి ఆమెతో పాటు ఓ అమ్మాయి కాఫీ ట్రే పట్టుకుని వచ్చింది. ఆమే మెయిన్ క్యారక్టరన్నమాట - పెళ్లి కూతురు!

వచ్చి ఠీవిగా కుర్చీలో కూచుంది. ఆమె మొహంలో అదోరకం దర్పం వెలిగిపోతోంది. మెడలో జెర్రి పోతంత లావుతో బంగారం గొలుసొకటీ సన్నని ఒంటి పేట గొలుసొకటీ వేలాడుతున్నాయి. కుడి చేతికి కడియం లాంటి బంగారు గాజు ఒకటే ఉంది. ఎడం చేతికి బంగారపు బ్రాస్‌లెట్‌తో వాచీ ఒకటి ఉంది. రెండు చేతుల వేళ్లకీ రెండేసి ఉంగరాలు, చెవులకి అర్ధ రూపాయి బిళ్లంత డిజైనుతో దుద్దులు ఉన్నాయి. పెదాలకి పల్చంగా లిఫ్‌స్టిక్ పూసుకుంది. కనుబొమలు సన్నగా కట్ చేసి ఉన్నాయి. ఇంట్లో ఉన్నప్పుడు గూడా చెప్పులు వేసుకుంటుందేమో కాళ్లకి మఖమల్ చెప్పులున్నాయి. కాళ్ల గోళ్లు పెడిక్యూర్ చేసి ఉన్నాయి. 'ఈ ఇంట్లో వాళ్లంతా అదో రకంగా ఉన్నారేమిటో!" అనుకున్నాడు రామేశం. ఆమె సభనంతా కలయజూసిన పోజుతో రామేశాన్నీ, రాఘవుల్నీ చూసింది. తర్వాత తండ్రికేసి ప్రశ్నార్థకంగా చూసింది. సుబ్రమణ్యం ఆమె భావం అర్థమైనట్టు తలూపి

"వీరు రామేశం గారు. మొన్న వస్తామని కబురు చేశారే వారే వీరు! ఆయన రాఘవులు గారని వారి ఫ్రెండు. మా అమ్మాయి విమల నాగిని" అంటూ పరిచయ కార్యక్రమం పూర్తి చేశాడు. కామేశానికి ఆ పేరు కృతకంగా తోచింది. అదేం పేరో అతనికి అంతుపట్టలేదు. నాగిని విమలంగా ఉండటమేమిటి? వట్టి పరవంచన!

"ఆఁ రాఘవులుగారూ మీరు మా ఇల్లు చూడలేదు కాదూ! రండి చూద్దురుగాని!" సుబ్రమణ్యం లేచాడు. ఆయన్తో పాటే ఆయన భార్య కూడా లేచింది. 'తమిద్దరికీ ఏకాంతం కల్పిస్తున్నారన్నమాట!' అనుకున్నాడు రామేశం. రాఘవులు కూడా అర్థమైనట్టు లేచి రామేశం కేసి 'కానీ!' అన్నట్టు తలూపి వాళ్లతో పాటే లోపలికి వెళ్లాడు.

వాళ్లు వెళ్లిపోయాక "మీరెందాకా చదివారు?" అందా అమ్మాయి ఇంటర్వ్యూలో ఎగ్జామినర్‌లాగా.

'ఎం.ఏ. లిటరేచర్ చేశానండీ!' అన్నాడు రామేశం.

"ఓ లిటరేచర్ చేశారా? లిటరేచరంటే నాకు పడదు. అందుకే నేను ఎకనమిక్సు చేశాను" అందామె. "తెలుస్తూనే ఉంది!" అన్నట్టు తలూపాడు రామేశం. "ఉద్యోగం కావాల్సిన వాళ్లు లిటరేచర్ చెయ్యగూడదు. అన్నట్టు మీకు ఉద్యోగం లేదా ఏమిటి?" అని అదేదో జోకయినట్టు విరగబడి నవ్విందామె.

రామేశం కంగారుపడి "అబ్బెబ్బె అదేం లేదండీ! సిటీ కాలేజీలో లెక్చరర్‌గా చేస్తున్నాను. అయినా లిటరేచర్ వాళ్లకి ఉద్యోగాలుండవని ఎందుకనుకుంటున్నారు?" అన్నాడు.

"నాకు తెలిసినంతవరకు లిటరేచర్ చేసిన వాళ్ళంతా నిరుద్యోగులుగానే ఉన్నారు. అసలు నేను పుట్టేదాకా మా నాన్నగూడా నిరుద్యోగే." అంది తన పుట్టుకలో ఏదో గొప్పతనం ఉన్నట్టు! మాట్లాడుతూ మధ్య మధ్య ఉంగరాలు సర్దుకోవడం, గొలుసులు సరి చేసుకోవటం గమనించాడు రామేశం.

"అది సరేగానీండి లిటరేచర్‌తో ఉద్యోగం సంపాదించుకోవటం చాలా చిత్రంగా ఉంది. రియల్లీ యు ఆర్ గ్రేట్!" అందామె నవ్వుతూ.

"ఆ గొప్పతనం నాది కాదులెండి. కాలేజీ కమిటీ వాళ్లది." అన్నాడు రామేశం అనీజీగా. టాపిక్

మార్చితే బాగుండునని అతనికి తోచింది. అంతలో ఆ పని ఆమే చేసింది.

"మీకు పిల్లలంటే ఇష్టమేనా?" అంది అకస్మాత్తుగా.

"అదేమిటండీ పిల్లలంటే ఇష్టం లేని దెవరికి? ఆఖరికి జంతువులకి గూడా పిల్లలంటే మమకారం ఉంటుందే!" అన్నాడు రామేశం.

"పెళ్లయిన పదేళ్ల దాకా పిల్లల జంఝాటం వద్దని నా ఉద్దేశం" అందామె ఖచ్చితంగా. అది అతను ఆశించిన జవాబు కాదు. "ఎందుకు?" అన్నాడు. "భార్యా భర్తలిద్దరూ ఒకళ్లనొకళ్లు అర్థమై ఆర్థికంగా నిలదొక్కుకునే సరికే కనీసం ఐదేళ్లన్నా పడుతుంది. ఈ రోజుల్లో నెలకి చెరో ఇరవై వేల చొప్పున సంపాదించినా ఇల్లు, కారు లాంటివి ఏర్పరచుకోవాలంటే ఆ మాత్రం సమయం అవసరం. అప్పటికి గాని పిల్లల్ని సరైన విధంగా పెంచే వీలూ, ఆర్థికస్తోమతా చిక్కుతాయి. మీరేమంటారు?" ఆమె టీవీ ఏంకర్‌లా హావభావాలు ప్రదర్శిస్తూ అడిగింది. రామేశానికి చిర్రెత్తుకొచ్చింది. అతనిలోని ఎంఏ ఆర్ట్సుగాడు చివ్వున లేచాడు.

"ఏమిటి మీ ఉద్దేశం? అంతమాత్రం సంపాదన లేని వాళ్లు పిల్లల్ని కనటం లేదా? సరిగా పెంచట్లం లేదంటారా?" వీలైనంత సౌమ్యంగా అడిగాడు. ఆమె కూడా అంతే సౌమ్యంగా అంది. "పోలికలు వద్దు. నేను మన విషయం మాట్లాడుతున్నాను. ఇప్పటికే కిలో బియ్యం పదిహేను రూపాయల దాకా ఉన్నాయి. ఇద్దరు సరదాగా సినిమాకెళితే వంద నోటు గాల్లో కలవటం ఖాయం. మిడిల్ క్లాసు కుటుంబానికి కరెంటు బిల్లు కనీసం ఆరు వందలకి తక్కువ రావటం లేదు. గ్యాస్ సిలిండర్ రెండొందల అరవై దగ్గర. ప్రత్యక్ష పనులు ముప్ఫయి శాతం, పరోక్ష పన్నులు తెలుసుకోలేని స్థితిలో ఉన్నాయి. పరిస్థితులు మారకుండా ఇలాగే స్థిరంగా ఐదేళ్లు ఉన్నా కూడా మధ్య తరగతి స్థితి గతుల్లో మార్పురాదు. అందువల్ల కొత్తగా పెళ్లయిన వాళ్లు కాస్త నిలదొక్కుకోవాలంటే ఐదేళ్లు కనీస మార్జిన్ ఉండాలి!" రామేశానికి ఆమె వేటగాడైనట్లూ తాను వేటాడ బడుతున్నట్లూ తోచింది.

"మీరు ఇంత ప్రాక్టికల్‌గా ఆలోచిస్తారనుకోలేదు. అసలు పిల్లలే లేకుంటే ఎలా ఉంటుంది?" అన్నాడతను కసిగా.

"నోనో. నా అభిప్రాయం మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు. దాంపత్య సుఖం అనుభవించటానికీ, పిల్లల్ని మనం అనుకున్న పద్ధతిలో పెంచటానికీ టైం కావాలనేదే నా ఉద్దేశం. పిల్లలు లేని జీవితం

## అమాయకత్వం



ఇప్పుడైతే జయప్రద ఆరిందాలా మైకు పుచ్చుకుని ఉపన్యాసాలిస్తోందిగాని, పదేళ్ళ క్రితం చాలా అమాయకంగా ఉండేది. మేఘసందేశం చిత్రం తాలూకు అవుట్‌డోర్ షూటింగ్ పోలవరం గోదావరి ఒడ్డున జరుగుతున్నప్పుడు లైట్ ఫెయిలయిన కారణంగా పేకాడుకొంటున్నారు నటీనటులు. అందులో జయప్రద డెబ్బై రూపాయలు ఓడిపోయింది. అంతే!! చిన్నపిల్లలా ఏడ్చినంతపని చేసి ఇంకెప్పుడూ పేకాడను- అని ఒట్టు పెట్టుకుని అక్కడ్నుంచి వెళ్ళిపోయింది. జయప్రద అమాయకత్వానికి ఆరోజు అందరూ నవ్వినవాళ్ళే!

**- సాయిరాం**

నిస్సారమని నేనూ అంగీకరిస్తాను. స్త్రీ మాతృత్వాన్ని అనుభవించాలనీ, పిల్లల ఉన్నతిని చూసి ఆనందించాలనీ నేను కోరుతాను" అందామె మెడలో జారిపోతంత గొలుసుని గుండ్రంగా తిప్పుతూ.

రామేశానికి ఏం మాట్లాడాలో తోచలేదు. అతని దృష్టి ఆమె మెడలోని గొలుసుల మీద పడింది. మీకు బంగారమూ, డబ్బూ అంటే చాలా ఇష్టంలాగుంది" అన్నాడు క్రూరంగా.

"అవును. అవంటే ఇష్టం లేనిదెవరికి? జీవితంలో నేను మొదట నేర్చుకున్న పాఠం అదే. నాకు ఉద్యోగమూ, స్తోమతా ఉన్నాయి కాబట్టి మీరు నన్ను చూడటానికి వచ్చారు. అదే పూటకి లికానా లేని పిల్లనైతే వచ్చేవారేనా? పెళ్లిళ్లే ఆర్థిక దృష్టితో జరుగుతున్నప్పుడు పిల్లల్ని కనడంలో ఆ దృష్టి ఎందుకుండకూడదు? మనం కావాలని ప్రేమతో మన అంశని ఈ లోకంలోకి తెస్తున్నప్పుడు ఆ మాత్రం జాగ్రత్త వహించటం మన బాధ్యత కాదా?" అందామె.

రామేశం నీళ్లు నమిలాడు "జీవితంలో డబ్బుకి అంత విలువ ఉందంటారా?" అన్నాడు.

"ఉంది. జీవితంలో డబ్బుకి తప్ప మరి దేనికీ విలువలేదు. డబ్బుని చులకన చేసి మాట్లాడటం ఆత్మ హత్యతో సమానం. మీ దగ్గర డబ్బు లేదేమో. లేక మీకు డబ్బు విలువ తెలిసి రాలేదో అందుకే డబ్బంటే తేలిగ్గా మాట్లాడుతున్నారు. మన పెళ్లి అంటూ జరిగితే దానికి పునాది డబ్బే!" అందామె నవ్వుతూ.

రామేశం ఏదో అనబోయేంతలో రాఘవులూ, సుబ్రమణ్యం గదిలో ప్రవేశించారు.

"మీ ఇల్లు చాలా బాగుందండీ! చాలా టేస్టుతో కట్టించారు. ముఖ్యంగా ఆ రాక్‌గార్డెన్ ఉందే అది ఈ రోజుల్లో లేటెస్టు ఫాషన్!" అంటూ రాఘవులు రామేశం పక్క కూచున్నాడు. విషయం ఏమైందన్నట్టు రామేశం కేసి కళ్లెగరేశాడు. రామేశం పెదవి విరిచాడు. అప్రసన్నంగా ఉన్న అతని మొహాన్ని చూడగానే విషయం అర్థమైంది రాఘవులుకి. విషయం స్పష్టంగా అర్థం అవుతూంటే ఇంకెందుకూ కూచోడం? రాఘవులు లేవబోయాడు. ఇంతలో సుబ్రమణ్యం భార్య కాఫీలతో వచ్చి "మరోసారి కాఫీ కానీండి" అంది. "అబ్బే ఎందుకండీ మీకు శ్రమ" అన్నాడు లేవబోతున్న వాడల్లా కూచుంటూ.

"శ్రమేముంది? ఏదో మర్యాదకి!" అంటు సుబ్రమణ్యం అందరికీ కాఫీలు అందించాడు. రెండు నిమిషాల్లో కాఫీలు ముగించి "మరింక వస్తామండీ!" రామేశం లేచి నిలబడి నమస్కారం చేశాడు. అందరూ లేచి నిలబడి నమస్కార ప్రతి నమస్కారాలు చేసుకున్నారు.

"నా మాటలు మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి" అంది విమల నాగిని నమస్కారం చేస్తూ.

"అబ్బెబ్బే అదేం లేదు. ఈ కాలానికి తగ్గట్టు మాట్లాడారు" అన్నాడు రామేశం ప్రతి నమస్కారం చేస్తూ.

"మరి ఏ సంగతీ....." కదలబోతుండగా సుబ్రమణ్యం అడిగాడు.

"రేపు మా రాఘవులు వచ్చి చెబుతాడు" రామేశం అన్నాడు. ఇద్దరూ బయటికి కదిలారు.

"ఏం జరిగింది రా! ఇంతకీ ఈ జన్మకి పెళ్లవుతుందా నీకు?" రోడ్డు మీద నడుస్తూ రాఘవులు అడిగాడు. రామేశం జరిగింది చెప్పాడు.

"ఇంకేం ఈ సంబంధం గూడా గంగలో కలిసినట్టే!" రాఘవులు అన్నాడు.

"గంగలో కలవడమేం ఖర్మ! నేనా అమ్మాయిని పెళ్లి చేసుకోబోతున్నాను." అన్నాడు రామేశం. అటుగా వస్తున్న ఆటోని ఆపుతూ.

"ఏమిటీ!" రాఘవులు నిశ్చేష్టుడైపోయాడు.

"అదంతే!" రామేశం అతన్ని ఆటలోకి తోశాడు.